

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal( Fulfilled Suggests Parametres by UGC)
Volume:14, Issue:3(1), March: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# తెలంగాణ ఉద్యమం - గేయం/పాట

డా. జి. వెంకటలక్ష్మి
అసోసియేట్ ప్రొఫెస్సర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
హయత్ నగర్, రంగారెడ్డి జిల్లా.

ఏ భాషా సాహిత్యాల్లో నైనా మాట కంటే ముందు పాటే పుట్టింది. అలసి సొలిసిన ప్రాణికి, హృదయానికి హాయి గొల్పింది. లాలి పాటైనా జోలపాటైనా, విజ్ఞానాన్ని అందించేదైనా వినోదాత్మకమైందైనా, ప్రబోధాత్మకమైందైనా... ఇలా ప్రయోజనమేదైనా అది పాట / గేయం ద్వారానే సాధ్యమవుతుందన్నది అక్షరాలా రుజువైన సత్యం. పాట ప్రక్రియా వైశిష్ట్యం అది. లయాత్మకమై, సమ్మోహింప జేయడమే దాని లక్షణం. తెలంగాణ పోరాట ప్రస్థానంలో, అమృతం చల్లినా, అగ్ని కురిపించినా అది "పాట"కే చెల్లింది. కాళ్లకు గజ్జెలు, చేతిలో డప్పు, భుజాన గొంగడే ఆహార్యం, అలంకరణగా పాట ఊరూరా మార్మోగి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. పల్లెనుంచి మొదలుకుని ఢిల్లీ దాకా తెలంగాణ తల్లికి "పాట" పల్లకీ మోసింది. గాయ పడిన కవి గుండెల్లో నుంచి, ఆ వేదనల్లో నుంచి, అస్థిత్వ చైతన్యంలో నుంచి ఉబికి వచ్చిన పాటలే మలి దశ తెలంగాణ పోరాటానికి ఊపిరైనాయి.. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో గూడ అంజయ్య, బండి యాదగిరి, సుద్దాల హన్మంతు పాటలు ఉర్రూతలూగిస్తే మలి దశలో గద్దర్, విమలక్క, అందెశ్రీ, గోరేటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న, రసమయి బాలకిషన్ వంటి ఎంద రెందరో కవులు, కళాకారులు తమ పాటలు, ఆటల ద్వారా మలిదశ ఉద్యమాన్ని నడిపించి 60 ఏళ్ల సుదీర్ఘ స్వప్నాన్ని సాకారం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టారు.

పరిశోధన, అధ్యయన సౌలభ్యం కోసం తెలంగాణ ఉద్యమ గేయ (పాట) సాహిత్యాన్ని వస్తు పరంగా క్రింది విధంగా విశ్లేషించవచ్చు.

(1) అమరవీరుల స్మృతి గేయాలు
(2) ప్రబోధాత్మక గేయాలు
(3) తెలంగాణ నేల తల్లిని స్తుతిస్తూ / ప్రశంసిస్తూ వచ్చిన గేయాలు.
(4) ఆర్థిక, రాజకీయ దోపిడీకి వ్యతిరేకంగా వచ్చిన గేయాలు

ఒక్కో అంశాన్ని సవివరంగా పరిశీలిద్దాం..

(1) అమరవీరుల స్మృతి గేయాలు: ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో స్వరాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానాలకు, ప్రాణ త్యాగాలకు సైతం వెరువని, సాహసం, చైతన్యం తెలంగాణ యువ కిశోరాలది. విద్యార్థులు, యువత బలిదానాలు తెలంగాణ ఉద్యమ గమనాన్ని పతాక స్థాయికి చేర్చాయి. దాదాపు 1200 మంది పైచిలుకు తెలంగాణ కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా విడిచి పెట్టారు. ఈ నేపథ్యంలో ఉద్యమంలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, కీర్తించు కుంటూ తక్కిన ఉద్యమ కార్యకర్తలను, ప్రజలను కార్యోన్ముఖులను కావిస్తూ వచ్చిన గేయ సాహిత్యం అంతా ఇంతా కాదు. అమరులు చూపిన తెగువను ప్రస్తుతిస్తూ వచ్చిన ఆ గేయాలు, పాటలు కరుణ రసాత్మకమై, ఆర్ద్రమై, హృదయాలను ద్రవీభవింప జేస్తాయి. ఈ వరుసలో శ్రీకాంతా చారిని స్మరిస్తూ మిట్టపల్లి సురేందర్ రాసిన

"రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా /
రక్త బంధము విలువ నీకు తెలియదు రా /
నుదుటి రాతలు రాసే ఓ బ్రహ్మ దేవా/
ఈ తల్లి మనసేంటో నీవు ఎరుగవురా" అనే పల్లవితో సాగే పాటదే అమరవీరుల పాటల్లో ఆగ్ర తాంబూలం. ఉద్యమ పోరాటంలో బిడ్డల్ని కోల్పోయిన తల్లుల ఆవేదనకు అక్షరరూపం కల్పించింది ఈ పాట. మంగళ హారతులు పట్టింది. చెట్టంత కొడుకును తిరిగి తెచ్చియ్య గలవా.... నీ మహిమలు" అంటూ ఈశ్వరా అంటూ బ్రహ్మ దేవుడినే ప్రశ్నించడం, పురిటి నొప్పుల బాధ ఈశ్వరా... నీ పార్వతిని అడగరా...శంకరా... తల్లి పార్వతి కి ఒక నీతినా, ఈ తల్లి గుండెల్లోన చితి మంటనా" అని ఆ పరమేశ్వరుణ్ణి నిలదీయడం ప్రతి తెలంగాణ తల్లి కడుపు తీపిని, గర్భ శోకాన్ని ఆవేదనా భరితంగా, కరుణా రసాత్మకంగా చిత్రించాడు రచయిత. ఈ పాట వింటే ఎంతటి రాతి గుండెయైనా కన్నీరు స్రవించక మానదు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal( Fulfilled Suggests Parametres by UGC)
Volume:14, Issue:3(1), March: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ఇక ఊరు ఊరునా మార్మోగిన మరో స్మృతి గీతం." వీరులారా వందనం విద్యార్థి అమరులా వందనం....పాదాలకు" అంటూ ఉద్యమంలో నేల కొరిగిన విద్యార్థుల ఆత్మ బలిదానాలను కీర్తిస్తూ సాగుతుంది. కరుణ రసాత్మకమైన మరో పాట. "జోహారులు జోహారులు... అమరులకు జోహారు, వీరులకు జోహారు" విద్యార్థి లోకాన్ని, యువతను తట్టి లేపింది. ఆత్మత్యాగం  చేసుకున్న అమరవీరుల బలి దానాలను కడుపులో దాచుకున్న తెలంగాణ ఆడబిడ్డల ఆవేదనను, బరువెక్కిన హృదయాలను ఆద్యంతం హృదయ విదారకంగా చిత్రిస్తూ యువతలో పోరాట పటిమను రగిలించింది. చైతన్యాన్ని జ్వలింప చేసింది. ఉద్యమ సాధనలో కర్తవ్య బోధను కావించింది. అడుగడునా అవమానాలు భరించుకుంటూ, అస్థిత్వం కోసం, ఉనికి కోసం సాగిన ఈ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల పైన ఎన్నో గేయాలు వచ్చాయి. స్థాలీపులాక న్యాయంగా ఇవి మచ్చుకు రెండు, మూడు ఉదాహరణలు మాత్రమే.

(2) ప్రబోధాత్మక గేయాలు: ఉప్పెనలా సాగుతున్న,ఈ మహోద్యమంలో సాగి రండి, కలిసి పోండి — అంటూ జన నినాదమై, పిలుపు నిచ్చి, ఊపు నిచ్చి జనులను జాగృతం చేసి, కార్యోన్ముఖులను కావించిన ప్రబోధాత్మక గేయాలు ఎన్నో ఎన్నెన్నో... ప్రాచీన ఆలంకారికులు కవిత్వ ప్రయోజనం అనందం, ఉప దేశాలని చెప్పారు. ఇక్కడ ఈ పాటలు, గేయాలు స్వరాష్ట్ర సాధన కోసం ,అస్థిత్వం కోసం ఉద్యమాన్ని పోరాటాన్ని సాగించాల్సిన ఆవశ్యకతను ప్రబోధించాయి. ఉపదేశించాయి. మేడి శ్రీధర్ రాసిన " రగులుతోంది తెలంగాణ రక్తపు మరకలై
రాలుతున్నారు వీరులు.. విద్యార్థులు కదిలి రండి"
అనే పల్లివితో సాగే ఈ పాట విద్యార్థి లోకాన్ని ఉద్యమంలోకి రమ్మంటూ ఆహ్వానిస్తోంది. "ఉడుకు నెత్తురుతో ఉప్పెనై కదిలిరా / ఉద్యమాల పోరులో ముందంజ వేయరా " అంటూ సాగుతూ.....అగ్నివై కదిలిరా, అరుపులై కదిలిరా, దరు వేయరా ... అంటూ కర్తవ్య బోధ చేస్తోంది.

ఆశన్న ఊషన్న తమ్ములారా/ ఆశన్న ఊశన్న లారా / తెలంగాణకై తెగువ తలెండి ' అనే పాట, విమలక్క ఆడి పాడిన " ఛలో ధూంధాం ఛలో ధూంధాం / తెలంగాణ జాతరొచ్చెరా / తెలంగాణ జాతరొచ్చ్చెరా/మత్తడి నుండి అలుగు తన్నుకొని పారినట్లు / మెత్తని గుండెలు సైతం నగారై మోగినట్లు / ఎత్తినాం బోనమెత్తి శివసత్తులు దుంకినట్లు/ఛలో ధూంధాం అంటూ సాగే ఈ పాట జనులను ఉర్రూతలూగించింది. తెలంగాణ జాతరలో ముందుకు దుంకి సాగుదాం రారండంటూ ప్రజలను ఆహ్వానించింది.ప్రేరణయై నిలిచింది.

"వీరుల్లారా.. వీర వనితల్లారా, అమ్మ రుణముకై రణములొరిగి నారా ..." అనే గేయం అమరవీరులను స్మరించుకుంటూ ప్రబోధాత్మకంగా సాగుతుంది.

"ఊరువాడా ఒక్కటై ఉద్యమించరన్నో జై కొట్టీ / తెలంగాణ
మెల్లమెల్లగా పోరు ఢిల్లీ జేరిందన్నో జైకొట్టీ తెలంగాణ /
వందలు వేలై జనం బారులు గట్టిండ్రో జై కొట్టి తెలంగాణ /
ఉసిళ్ల వుట్ట తీరు ఉప్పెనైండ్రో జై కొట్టీ తెలంగాణ /
ఊరు వాడా టెంటు లేసి పోరు నడిపిండ్రో.....". అంటూ ఉద్యమ గమనాన్ని, గతిశీలంగా వివరిస్తూ యువజనులను ఉర్రూతలూగించిన పాటలు వందలాదిగా వచ్చినాయి.
ప్రజాయుద్ధ నౌక - గద్దర్ కాళ్లకు గజ్జెలు కట్టి చిందేస్తూ ఆడుతూ పాడిన " పొడస్తున్న పొద్దుమీద పోరు తెలంగాణ మా" పాట మొత్తం తెలంగాణనంతటినీ తట్టి లేపింది. "మానీళ్లు మాకేనని కత్తుల కోలాటమా కన్నీటి గానమా" అంటూ గొంతెత్తి నినదించింది. తెలంగాణ ప్రజలపై నాలుకలపై నర్తనం చేసింది. తెలంగాణ ప్రజలను ప్రబోధకం కావించిన పాటల్లో మరో ప్రముఖమైంది " జైబోలో తెలంగాణ, నిలు వెల్ల గాయాల వీణ".
"జన జాతరలో మన గీతం / జయకేతనమై ఎగరాలి/ ఝుంఝూ మారుత జననినాదమై జేగంటలు మోగించాలి/ ఒకటే జననం... ఒకటే మరణం / జీవిత మంతా జననమే మననం/ కష్టాల్ నష్టాల్ ఎదురైనా .. కార్యదీక్షలో తెలంగాణకై/ జై బోలో తెలంగాణ నిలువెల్ల గాయాల వీణ – అనే సుద్దాల అశోక్ తేజ రాసిన పాట "జైబోలో తెలంగాణ నినాదాన్ని ఇంటింటా మార్మోగింపజేసింది. జేగంటలు మోగించింది. పోరాట గమనంలో ఎన్ని కష్ట నష్టాలు ఎదురైనా మన కార్యదీక్షలో పట్టు విడువరాదంటూ ప్రబోధా త్మక సందేశాన్నిచ్చింది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal( Fulfilled Suggests Parametres by UGC)
Volume:14, Issue:3(1), March: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ప్రజా వాగ్గేయ కారుడు "గోరేటి వెంకన్న' రాసిన జబ్బకు సంచి చేతుల జెండా, జాతర పోదమా - అన్న పాట తెలంగాణ జన జాతరలో చేరి పోదాము రారమ్మంటూ ఊరూరా ఉర్రూత లూగిం చింది. తెలంగాణ పల్లె నుడికారంలో గూడ అంజయ్య రాసిన "అవ్వడివా నువ్ అయ్యోడివా / తెలంగాణకు నువ్ పాలో డివా! ఇసంట రమ్మంటే ఇల్లంట నీదంటవా / తిన్నింటి వాసాలు లెక్కిస్తవా / గుంటూరులో గుంట జాగడి గితిమా / విశాఖ ఉక్కులో గుండు సూదడి గితి మా - అంటూ సాగే పాట నడుస్తున్న ఉద్యమానికి సైరన్ లా ఉప్పందించింది. జన చైతన్యంలో ఉద్యమ గీతం ఊరూరా తిరిగింది. ఉద్యమ సమాచారాన్ని గడప గడపకూ చేరవేసింది. కవులు, కళాకారులు, వాగ్గేయ కారులు ఈ జన జాతరలో ముందుండి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఈ పదమూడేళ్లూ తెలంగాణ ఉద్యమమే 'పాట', పాటే ఉద్యమమై ....వెన్నెముకై.... మహోద్యమమై సాగింది. కవులు, కళాకారులపై ఎన్ని నిషేధాలు, నిర్బంధాలు విధించినా " కొట్టురా కొట్టు నిప్పుల మీద డప్పుల దండోరా ... అంటూ జన నినాదమై గొంతెత్తిన స్వరాన్ని దిక్కులు పెక్కటిల్లేలా పల్లె నుంచి ఢిల్లీ దాకా వినిపించింది.

(3) తెలంగాణ తల్లి స్థుతి / ప్రశంస :- తెలంగాణ తల్లి ఈ పేరు చెబితేనే ఒళ్లు పులకరించి పోతుంది.. " నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ మహాకవి దాశరథి కృష్ణమా చార్యులు రత్న గర్భయైన తెలంగాణను కీర్తించాడు. అపారమైన ఖనిజ సంపద, కృష్ణా, గోదావరుల జల వనరులు, అద్భుతమైన శిల్ప కళా వారసత్వ సంపద ఈ నేల సొంతం. ఎంతో ఘనమైన తర తరాల సాంస్కృతిక గత వైభవం, ప్రాశస్త్యం తెలంగాణకే దక్కుతుంది. తెలంగాణ వైభవాన్ని కీర్తిస్తూ అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ" పాట ఉద్యమ సమయంలోనూ, తర్వాత స్వరాష్ట్రమైనంక కూడా తెలంగాణ జాతి గీతమై అలరారుతోంది.

"జయ జయహే తెలంగాణ
జననీ జయ కేతనం /
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం/
తరతరాల చరిత గల తల్లి నీరాజనం /
పది జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం/ అనే పల్లవితో సాగే ఈ పాట - పోతన పాండిత్యాన్ని, రుద్రమ ధీరత్వాన్ని, కొమరం భీమ్ ధైర్య సాహసాలను కీర్తిస్తూ, కాకతీయుల రామప్ప ఆలయ శిల్ప సౌందర్యాన్ని, గోలకొండ నవాబుల వాస్తుశిల్ప వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించింది. అణువణువున ఖనిజాలే నీ కడుపులో ఉన్నాయంటూ సింగరేణి విజయగాధను వర్ణిస్తాడు. కృష్ణా గోదావరులు మన బీడు భూములకు మళ్ళితే తెలంగాణ సశ్య శ్యామలమ వుతోందన్న ఆకాంక్ష కూడా ఈ గేయంలో కనబడుతుంది.

డా.నందిని సిధారెడ్డి రాసిన "నాగేటి సాళ్లలో నా తెలంగాణ, నా తెలంగాణ ' అన్న గేయం తెలంగాణ జీవన, సాంస్కృతిక సౌరభాలను వెదజల్లింది. తెలంగాణ సంస్కృతి విశిష్టతను చాటి చెప్పింది. బతుకమ్మ, ధూల, అలయ్-భలయ్ వంటి ప్రత్యేకాంశాలను స్పృశిస్తూ సాగే ఈ పాట తెలంగాణ ప్రాశస్త్యాన్ని వివరిస్తోంది.

".....తంగేడు పూలు తంబాల మంతా/
తీరొక్క రంగుల్లా తీరిచ్చినా వూవు /
బంగారు చీరల్ల బాజారులన్నీ/
బతుకమ్మ పండుగ నా తెలంగాణ, నా తెలంగాణ/
బంతి పూలా తోట నా తెలంగాణ, నా తెలంగాణ. అంటూ సాగే సిధారెడ్డి గారి పాట ఉద్యమ కాలంలో ప్రతి ఊరిలో, ప్రతి ఇంట్లో మార్మోగిందింది.

తెలంగాణ పల్లె గొప్పతనాన్ని కీర్తిస్తూ అందెశ్రీ రాసిన -" పల్లె నీకు వందనా లమ్మో, నను గన్న పల్లె - తల్లి నీకు వందనాలమ్మో పాటు బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి, ఈ నేల తల్లిని కీర్తిస్తూ ఎన్నో పాటలు ప్రభవించినాయి. ప్రజల్లో స్ఫూర్తిని నింపి, దేశభక్తిని, మాతృ భూమి స్వేచ్ఛ, స్వాతంత్ర్య కాంక్షను రగిలించాయి. ప్రజల్లో స్వాభిమానాన్ని రేకెత్తించాయి.

(4) తెలంగాణ గడ్డ మీద సాగిన ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక విధ్వంసాలకు వ్యతిరేకంగా.... ఎన్నో పాటలు పురుడు పోసుకున్నాయి. ఒక్కో పాట వింటుంటే రోమాలు నిక్క పొడుస్తుం టాయి. అంతటి భావ బంధురమైన నేపథ్యం ఇక్కడి గేయ సాహిత్యానికి వుంది.
"దేశ ముఖులను దొర భూస్వాముల /
గడీల నుంచి ఉరికించాం ||గడీల నుంచి||
రజాకారులను తరిమికొట్టి
నైజాముకే గోరి కట్టేశాం || గోరి కట్టేశాం||
రోశం గుండెన రోకలి బండల/
బిగిసిన పిడికిలి బడిసెల రాళ్లై -అన్న పాట పోరాట స్వరూపాన్ని కళ్లకు కట్టినట్లుగా చిత్రించి,ఆవేశంతో రగిలి పోయేలా జేస్తుంది.

జయరాజ్ రాసిన " ఇంకేమి మిగిలిందిరా / తెలంగాణ పల్లెర్లు కాసిందిరా ..." అంటూ తెలంగాణలో కరవు విధ్వంసాన్ని కరుణ రసాత్మకంగా చిత్రించాడు . " పల్లె పల్లెనా పల్లెర్లు మొలిసే పాలమూరు లోనా, మన తెలంగాణ లోనా....అంటాడు. ఇంకా ప్రజా వాగ్గేయ కారుడు గోరేటి వెంకన్న రాసిన "పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల ... అంటూ దెబ్బ తింటున్న పల్లె జీవితాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, సంస్కృతిని సామ్రాజ్యవాద వ్యతిరేక కోణంలో నుంచి పల్లెను ప్రత్యేకించి తెలంగాణ పల్లెను పట్టి చూపించాడు ఈ పాటలో.

మేడి శ్రీధర్ రాసిన "రగులుతున్న తెలంగాణ రక్తపు మరకలై " అనే పాటలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ దోపిడీని, దోపిడీకి గురవుతున్న వైనాన్ని చిత్రించాడు.
"... ... .. చదువున్నా తెలివున్నా కొలువులేమి లేవురా/
నీళ్లున్నా నిధులున్నా కళ లేని బతుకురా/
చేను చెలకలెన్నున్నా మెతుకు లేని బతుకురా/
రాజ్యమంత నీళ్లున్నా గుక్కెడైన లేవురా..."
అన్న పంక్తులు తెలంగాణ సామాజిక, ఆర్థిక పరిస్థితులకు నిలువుటద్దంగా కనిపిస్తాయి.

తెలంగాణలో కరవు - కరాళ నృత్యాన్ని తన " వానమ్మ వానమ్మ పాటలో ఆవేదనాత్మకంగా వర్ణించారు.
" వానమ్మా వానమ్మా వానమ్మా/
ఒక్క సారన్న వచ్చి పోవే వానమ్మా/
తెలంగాణ పల్లెలన్నీ ఎండే మండుతున్నై /
తినడానికి తిండి లేక, తాగేందుకు నీళ్లు లేక/
ఉంటానికి గుడిసే లేక, కాపాడే నాధుడు లేక ||వానమ్మ||
చేలల్లో నీరూ లేదు, చెలకల్లో నీళ్ళూ లేవు
వాగుల్లో నీళ్ళూ లేవు, వంపుల్లో నీళ్ళూ లేవు
నిన్నే నమ్మిన రైతు కళ్లల్లో నీళ్లు లేవు .... " అంటే.
ఇక్కడ ప్రకృతి సహకరించక కొంతైతే, పరాయి పాలకుల లకుల నిర్లక్ష్యం కొంత కలిసి తెలంగాణ రైతులను, వ్యవసాయాన్ని, ఆర్థిక స్వాతంత్రాన్ని కొల్ల గొట్టాయి.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal( Fulfilled Suggests Parametres by UGC)
Volume:14, Issue:3(1), March: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ఈ విధంగా వేల కొద్దీ పాటలు తెలంగాణ ఉద్యమ సాహితీ క్షేత్రంలో ప్రభవించి, ఉద్యమాన్ని కడదాకా నడిపించి కార్య ఫలాన్ని దక్కించుకునే దాకా పాటే - పోరు, పోరు బాటే - పాటగా జన నినాదమై, జయ కేతన మై, కోట్లాది ప్రజల సమర నినాదమై నించాయి. గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాత్, కొడాల శ్రీనివాస్, యశ్ పాల్, నాగన్న, నేర్నాల కిశోర్, దేవరకొండ భిక్షపతి, వరంగల్ శ్రీనివాస్, మిట్టపల్లి సురేందర్, రసమయి బాలకిషల్, దేశపతి శ్రీనివాస్, దరువు ఎల్లన్న,ఏవూరి సోమన్న ... ఇంకా ఎందరో. ఎందరెందరో తెలంగాణ పాటల పూదోటలో మకరందాన్ని చిందించారు. అమృతాన్ని వర్షింప జేశారు. అగ్గి కణికలను రాజేశారు. తెలంగాణ ఉద్యమానికి, పాటకు ఇలా అవినాభావ సంబంధ ముంది. దేశంలో మరే పోరాటానికి లేని భావజాల నేపథ్యం, సాహిత్య స్పృహ, సామాజిక స్ఫూర్తి తెలంగాణకే వుంది.అది ఈ నేల సొంతం.